# "అలుప సంతోషి నాగయ్య"

బెస్త నాగయ్యకు పానం మంచిగ లేకుంటయింది. ధించి పోపిచ్చినా, ఎత్తి పోపిచ్చినా మంచిగ్గాలే. పంబాలోన్ని పిలిపిచ్చి మంత్రాలేపిచ్చినా తక్కువ గాలే. ఊల్లున్న అవుసులోల్ల పిల్లగాడు గోలీలిచ్చినా బీమారి తగ్గలే. సూదులేసినా తక్కోగాలే. ఇగాకరుకు కన్నాగురం తీసుకపోవల్సొచ్చింది. ప్రైవేటు దావఖాన్ల శెరీఖు సేసింగ్రు. నాగయ్యది పెద్దబలగం. ఆర్గురు కొడుకులు. ఇద్దరు బిడ్డెలు. ఊరూరికి దండిగ సుట్టాలు. ఒగలెనుకొగలచ్చి సూసిపోవట్టింగ్రు. రోజు ఊళ్ళెనుంచచ్చే బస్సుల పదిమందన్న నాగయ్యంజూసుటానికి దిగెటోల్లు. ఓసారి జరమచ్చుడు, ఇంకోసారి బందవుడు, ఇంకోసారి కక్కు బీమారి సంగతి పెద్ద డాకుటరుకే సముజైతలేదు. వచ్చి పొయ్యేటోల్లతో బాగ మాట్లాడద్దంటె నాగయ్యినడు. ఓనాడు నేను సూత్తామని పొయ్యేవారకు సుట్టూర మందిని కూసుండవెట్టుకోనున్నడు. కొద్దిగోతీరుగున్నట్టుంది. ఊరోల్లతోని బాగమాట్లాడుతండు. నేనట్రల కడుగుపెట్టంగనే "రా బిడ్డ రా అట్లచ్చి కూసో" అని స్టూలు సూపెట్టిండు. నేను స్టూలుమీద కూసున్న.

"ఎట్లున్నదే మామ? పానమోతీరుగుందా" అనడిగిన.

"ఇదేదో తెలువని రోగమే అచ్చింది బిడ్డ" గడియకో తీరుగుంటంది. రొంట్రోజులు మంచిగుంటది. అటెనుక రొంట్రోజులు క్యాల్లే లేకుంటయితది. అంత కిందుమీదే ఉంది బిడ్డ"

• "డాకుటరేమంట్రే మరి?"

"అయినేమంటడో నీకు తెలువదా అల్లుడ? ఇంకో గంటకు సచ్చిపొయ్యేటోన్ని గూడ బతుకుతడనే సెప్పుతడు. మంచిగైతదనే అంటడు. అయినా ఎవ్వలననేదేముంది కొడుక? ఊరు పొమ్మంటుంది. కాడు రమ్మంటుంది. ఇగెన్ని రోజులున్నా రాలిపొయ్యేటిదేనాయె గీ సెత్త".[75]

"గీ డాక్టర్ పెద్ద సదువులు సదివిండు. నిన్ను మా బతికిత్తడు"

నా మటలిని విరాగోలె నవ్విండు నాగయ్య.

"బతుకిచ్చుడాల్ల సేతులున్నాది బిడ్డ. ఆయుష్షు గూడినంకెవ్వలేం జెయ్యరు. ఏదో అట్ల కోశిశ్ సేసుడు" అన్నడు.

★ ★ ★

"గది నిచ్చమేకని నువ్వు ఆశ్చర్యపడద్దే మామ. ఎనుకట పంతులుకే వెతిరేకంగ కొట్లాడినోనివి. మీకు గీ రోగమో లెక్కానె?" ఉబ్బిచ్చి నేను.

నాగయ్య మొకంల వెలుగు కనవడ్డది. ముడుతలు వడ్డ మొకాన్నోసారి రాసుకున్నడు.

"నన్నెంత గోస పుచ్చుకున్నరు కొడుక పెద్దమనుషులు. ఆ సరుపంచి సెప్పినట్టు నేనిన్లేదని మా అండ్ల మాకే కొట్లాటలు వెట్టిచ్చె. గద్దెలునుకోక మేమన్న దమ్ములం పొలాలగెట్ల కాడ మొదలువెట్టి అంతట కొట్లాడుకునుడేనాయె. ఒగల్నొగలం బురుదలేసి తొక్కుకుంటిమి. గిది జూసుకుంట గయినేమొ నవ్వె. మా వోళ్ళేమొ కర్నపోని ముడ్డికిందికే పెయిరి"

"నిజమేకని మామ. మీ అన్నలు నిన్ను సూసుటానికచ్చింద్రా?"

"ఇగ అన్నలెవ్వలు? పెద్దోడు సచ్చేపాయె. ఆని కొడుకులు రొండు మూడేండ్లవట్టి నాతోని మంచిగనే కల్సుంటంద్రు. ఇగ సిన్నోడు ఇసపాతుకపు[76] గాడిది కొడుకు. అట్లో పొరచ్చి పెయిండు కంటి డుతుపుకు".

"ఎవ్వల పాపంలాల్లే పోతరు తియ్యే మామ. అయినా గని గిప్పుడు నీకేం పర్వ. కొడుకులందరెదిగిండ్రు. మంచిగ ప్రశాంతంగుండు నువ్వు. దేని కారాటపడద్దు" అన్న నేను.

"నాకేమారాటం బిడ్డ? ఓ దిక్కు ఊల్లె పెద్ద మనుషుల్తోని కొట్లాడుకుంట గూడ పొల్లగాండ్లనందర్నీ రేవుకు దెచ్చిన. ఆదిలాబాదు జెంగలుకు పొలం బొయ్యి కట్టె దెచ్చిన. ఊళ్ళె పెద్దిల్లు గట్టిన. ఉండదల్చుకుంటె అర్గురైనుండచ్చు. అయినాగనూళ్ళుండేది ముగ్గురేనాయె".

"ఏం నాగయ్యా! మాట్లాడద్దంటె మాట్లాడుతన్నవా? సరె తియ్యి. సభే పెట్టినవు గద అంటూ అర్రలకు డాక్టరచ్చిండు. అయినెంజూసి **మేవంత ఇవుతలకచ్చినం**. అయినె సూసిపెయినంక మల్ల లోపలికి పెయినం. కొందరెల్లిపెయింద్రు.

"నాకు రందేం లేదు. కొడుక. పెద్దోడెవుసం జేసుకుంటండు. పైరవీల్లు గిట్టజేత్తడు. బందవస్తుగనే ఉన్నడు. రొండోడు నేను పంచిచ్చిన బూమితోని ఇంకింత కొనుక్కున్నడు. మంచిగనే బతుకుతండు. నడిపోల్లు ముగ్గురు బెల్లంపెల్లిల నౌకర్లు జేత్తండ్రు. అందరికి పొల్లగడ్లయింద్రు. పెద్దల్లుడు మంచిగనే ఉన్నడు. చిన్నల్లుడు అయినెకయినె బతుకతండ్రు. ఇగ నాకేల రంది? కన్నందుకు పొల్లగాండ్లంత రేవుకచ్చింద్రు. ఒక్క సిన్నోనికి నౌకరయిందంటె ఇగేం డోక లేదు. బెల్లంపెల్లిలున్నోల్లానికి నౌకరి మా సూత్తరు" నాగయ్య మొకం మీన ప్రశాంతతుంది.

"గట్ల తురితిపడన్నే మామ! బతుకుల తురితుంటెనే సుకముంటది. ఎంతున్నాగని మనిషికి

తురితనేది లేకుంటె ఆడస్సలే సుకపడడు. దేనికోదానికెప్పటికారాట పడ్తనే వుంటడు" అన్న నేను.

"చిన్నోనివయిన సక్కగ సెప్పినవు బిడ్డ! అయినా నాకు తురితి లేకుంటేమైంది. నేనీంత కల్లు దాగిన. పొద్దాటిది, పరుపుదాటిది, ఏ కల్లు పారితాకల్లు దాగిన. నికాలస్‌ది ఒక్క సెట్టు దిడిపిచ్చుకోని దాగిన. నల్లగల్లు ఇప్పపువ్వుతోని సేయించుకొని దాగిన. బీరు, బ్రాందిలు గూడ దాగిన. ఇగనేం దినందే లేదు. కోడికూర దిన్న, గొర్రెమ్యకది తిన్న, కుందేలు మాంసం గూడ దిన్న. ఓపారి దుప్పిమాంసం, అడివిపంది కూర గూడ తిన్న. కొడుకులు, బిడ్డెలందరు పిల్లలతోని సల్లంగున్నరు. నా కిగ బంగ్లాలెందుకు? బవంతులెందుకు? నా సుట్టూర గింతమందున్నరు. ఇంక నాకేం గావాలె సెప్పు? నేం జచ్చిపెయినా నాకిప్పుడేం రంది లేదు. తురితిగనే పానమిడుత్త. నా కోరిక లిగేం లెవ్వు పెద్దగ".

"గిప్పుడు గవ్వన్నెందుకే నాయిన్న. ఇరాం లేకుంట మాట్లాడవడ్తివి" అన్నడు నాల్గో కొడుకు శెంకరయ్య.

"డాకుటరు గట్లనే సెప్పుతడు. నన్ను సెప్పుకోనియ్యలేవు బిడ్డ. నాకు బతుకుతనన్న నమ్మకం లేదు. అయినా గని ఎనుబయేండ్లకచ్చిన. ఇంకా బతికేం జెయ్యాలె? నాకొక్కటే కోరికుంది బిడ్డ. గిదయితె తీర్సుండ్రి. మీరంత గలిసి. నేం జచ్చిపెయినంక ఐదారునూర్ల మందికి సెయ్యి గడిగియ్యండ్రి, మంతెన్నుంచి అయ్యగార్లందెప్పిచ్చి దినాలయ్యేదాక ఇంటిముంగట హరికతలెప్పియ్యండ్రి, బజనలు సేయించుండ్రి, ఓ మంచావును గొని గోదానమియ్యండ్రి. గింతే నేం గోరుకునేది" అని కండ్లనీరు తీసుకున్నడు నాగయ్య.

శెంకరయ్య తండ్రి కండ్లను తుడ్సిండు.

"నువ్వేం సచ్చిపోవు మామ! ఇంక పదేండ్లన్న బతుకుతవు" అని ధైర్యం సెప్పి నేనెల్లిపెయిన.

నాగయ్య మొకంలున్న ప్రశాంతత, తురితి నాకెవ్వరిలోనూ కనపడలేదు.

కాని బతుకుతడనుకున్న నాగయ్య నేంజూసచ్చిన వారం రోజులల్ల సచ్చిపెయిండని తెల్సింది. కొడుకులయినె కోరినట్టే కర్మ జేసిండ్రు. ఉన్నదాంతోని తురితిపడుడు నేర్చుకున్న. అలుప సంతోషి నాగయ్య నాకండ్లముందప్పుడప్పుడు కదులుతనే ఉంటడు. నేనూర్లెకు పెయినప్పుడు ఎప్పడచ్చినవల్లుడా అని పలుకరిచ్చే నాగయ్య మామ సచ్చిపెయిండంటె నాకెట్లనో అనిపిత్తది.

ఎందరో పెద్ద మనుషులు.........వాళ్ళ ప్రేమలు.....అప్యాయతలు.........ఓ తరం బోతె మరో తరంలో ప్రేమలు తగ్గుతున్నయి. కృత్రిమత్వమత్తుంది. రోజు రోజుకా పలుకరింపులు తగ్గుతన్నయి. ఈ తరంల అవ్వన్ని పోవుడు సూత్తంటె నాకు బాదనిపిత్తంది.